# చాదస్తపు భార్య

ఆ వేళ ఏ కారణంచేతో అందరికంటె ముందుగా లేచింది ఆశ్లేష. కార్యక్రమాలు త్వరగా ముగించుకొని రవీందర్ లేచేటప్పటికే వెచ్చని కాఫీ తయారుచేసింది.

క్లోరోఫిల్ కలిగిన కోల్గేట్ డెంటల్ క్రీముతో విజ్‌డమ్ టూత్ బ్రెష్‌ని ఉపయోగించి, కాఫీ మీద భ్రమతో త్వరగా దంత ధావనం పూర్తిచేసుకుని బయటపడ్డాడతను.

ఆవిర్లు గక్కుతున్న అతి స్ట్రాంగ్ కాఫీ అర్పించింది;ఆవిడ. "లేచిన వేళావిశేషం, ఎవరి మొహం చూశానో" అనుకుంటూ మొహాన్ని చేటంత చేసుకుని, ఆనందముతో ఇండియా కాఫీ హౌస్‌వారి పరిమళ కాఫీపౌడరుతో కాచబడిన కాఫీని చప్పరిస్తూ ఆనందించ సాగాడు—అతను. నిజానికి రోజూ లేవగానే తన మొహమే అద్దంలో చూచుకోవడం అలవాటు, ఆతనికి—దురదృష్టాదృష్టాల భారం ఇతరుల మొహాలమీద వెయ్యడం ఇష్టం లేక.

ఆశ్లేష ఆతనికేసి చోద్యంగా చూస్తోకూర్చుంది. అతనికి ఆమెను చూస్తూంటే వాయు పవనాల ధాటికికూడ ఆగి, నలిగిపోని కొత్తగా వికశించిన ఉదయకాలపు మల్లెపువ్వు గుర్తుకొచ్చింది.

"నువ్వు తాగడం లేదేం?"

"తర్వాత."

"ఈవేళ ఇంత మార్పొచ్చిందేం నీలో?"

"తొమ్మిదైనా కాఫీకి కనిపెట్టుకుకీ నేలాచేసే దానివి, ఇంత పెందరాళే అనాయాచితం గానే..."

"అంతా వుంది."

"ఏమిటది?"

"మీకే తెలుస్తుందిగా."

"చెప్పకూడదా?"

"మీకే తెల్సు"

"ఏమిటబ్బా?...ఆఁ; ఇంకేముంది— పూజలూ, పునస్కారాలూను"

"నేను చెప్పాగా... మీకు తెల్సు! ఈవేళ నాగుల చవితి!" అని అతని గుండెమీద తట్టింది.

"అదా సంగతీ?" అని అతను కుర్చీలో వెనక్కి జారగిల పడ్డాడు. కరిగిపోతున్న ఉత్సాహంతో.

ఆశ్లేష ముఖ కవళికలు కూడా మారాయి.

"అదేం అలా అంటున్నారు?"

"నీ చాదస్తం మానవు కదా? ఎందుకంతా టయిమ్ వేస్ట్?"

"ఛా! అలా అనకూడదు. అంతా మీకోసమేగా, నా పూజలూ, నోములూ; మీ అభ్యుదయానికేగా!"

"అదేం కాదు. 'మళ్ళీ జన్మలో ఇంతకంటె మంచి మొగుణ్ణి ఇప్పించు దేవుడా! నేను మళ్ళీ ఆడజన్మ ఎత్తి వంటింటి కుందేలు జీవితాన్నే భరిస్తాను' అని."

"మీరు బరి తెగించి పోయారని, అందర్నీ పూజలూ పునస్కారాలూ మానమంటే ఎలా?"

'కాదులే నీ జన్మకోసం ఉన్న ఒక్క జన్మలోనూ కష్టాల్ని కొనుక్కు తెచ్చుకోవాలి.'

'మీ అంత నాస్తికులకు అసలు పుట్టగతులుండవ్'

'మళ్ళీ జన్మల్లేకుండా, ఆ పరబ్రహ్మలో ఐక్యం కావాలనేగా అందరి ఆరాటం'

'ఇంత చదువు చదువుకున్నాం కదా అని మాటలు బాగా చాత్రవును'

'నీకు మాత్రం?'

"మీతో వాదన వేసుకోడానికి నాకేం తీరిక లేదు. నాకు బోలెడంత పనుంది'

'అందుకే ఈ దయార్ద్ర వీక్షణమని నా కప్పుడే తెల్సిపోయిందిలే'

'అవును గాని...'

"మరింకేమిటి తరువాయి?"

"మనింటివాళ్ళు వూరిబయటకు పుట్టలో పాలోసేందుకు వెడుతున్నారు. దొరవారు అనుమతిస్తే..."

"రోడ్ల వెంబడి ఊరేగుతా నంటావ్?"

"అది కాదండీ?"

'ప్చ! అవేం నాకు నచ్చవ్. నీ పూజలూ, పునస్కారాలూ ఇంటిలో చేసుకుంటేచాలు. ఆ భగవంతుడికి కావాల్సింది మనస్ఫూర్తి అయిన సేవ కాని పటాటోపంకాదు.

"ఈవేళొక్కరోజుకీ..."

"వొద్దన్నాగా...ఆ పైన నీ యిష్టం"

"మీరెప్పుడూ ఇంతేగా, ఇంతకంటె ఎప్పుడూ వైభవం వెలిగిస్తారని నే అనుకోలేదు" అంటూ మొహం చిన్న బుచ్చుకొని అశ్లేష అక్కడ్నించి, గ్లాసు తీసుకొని, విసురుగా వెళ్ళిపోయింది. చేసిన ప్రయత్నం వృథా అయినందుకు విచారిస్తూ.

రవీందర్ తన లోనే నవ్వుకున్నాడు భార్య చాదస్తాన్ని చూసి.

అతను చాలా అభ్యుదయ భావాలు కలవాడు; పూజలూ, మొదలైన మూఢ నమ్మకాలమీద అట్టే నమ్మకం లేదు.

మేనరికమవడం వల్లా, తల్లి దండ్రుల బలవంతం వల్లా అతను ఆ పెళ్ళికి అంగీకరించాడు. అందువల్ల అతని భావాల కనుకూలమైన భార్య దొరకలేదు. పోనీ ఆశ్లేషనే తన ఆదర్శాల కనుకూలంగా చేసుకుందామని ఆశించాడు. కాని ఆశ్లేష చాదస్తపు వాతావరణంలో పెరిగింది. అందుచేత అతను తేవాలనుకున్న పరివర్తనలన్నీ పరావర్తనమై, నిష్ప్రయోజనమై గాలిలో కల్సిపోయేవి.

అందుకని గత్యంతరం లేక సహజీవన సిద్ధాంతాన్ని కనిపెట్టిన నెహ్రూని అభినందిస్తూ, తమ కుటుంబ జీవితంలో అదే సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టసాగాడు.

ఆశ్లేష కోపాన్ని మనస్సులోనే అణచుకుని, ఎలాగో ఇంట్లోనే పూజని పూర్తి చేసుకుంది.

అతను మడి గట్టుకో లేదనే కారణాన వంటింట్లోకే రానీక మధ్యగదిలో అన్నం పెట్టింది—పన్నెండు గంటలవేళ పూజానంతరం.

అతను నవ్వుకుంటో తిని వెళ్ళిపోయాడు.

ఆ రోజంతా ఆశ్లేష అతనితో మాట్లాడనేలేదు.

కోపంవల్ల ఏ కందులో మినుములో బాగుచేసుకుంటో కూచుని, కాలక్షేపం చేసింది.

సాయంత్రం అతను బజారుకుపోయి తర్వాత క్లబ్‌కి వెళ్ళి, సాయంత్రం ఏడు గంటలకు తిరిగి వచ్చాడు.

భార్యారత్నం వీధి గుమ్మంవద్ద కూచుని ఉండడంతో అతనికి దిగులు కలిగింది.

"కొంచెం పక్కకి తప్పుకోనీయండి" అంది పక్కగా పూలమొక్కల చాటుకుపోతూ.

"ఏందీ" అన్నా డతను.

"మీరేం బెంగ పడక్కర్లేదు. అంతా అమర్చాకనే, ఇప్పుడే తగులడ్డాను లెండి. మీరిన్ని మెతుకులు తిని, నాకూ పడెయ్యడమే. నాకు పెట్టకపోయినా పరవాలేదు ఈరాత్రికి" అంది.

"అగ్గి పెట్టేదీ?"

"వంటింట్లో దేముడి గూటికిపైన వుంది. కొంచెం కాళ్లు కడుక్కుని లోపలికి వెళ్ళాలి దొరగారు"

అతను వీధిగుమ్మంవద్ద నున్న పంపుదగ్గర కాళ్ళు కడుక్కుని, లోపలికి వెళ్ళాడు. లోపలంతా కను చీకటిగావుంది. కళ్ళు పెద్దవి చేసుకుని అగ్గిపెట్టెకోసం దేముడుగూడు దగ్గర వెతక సాగాడు.

గోడమీద పెద్ద తాచుపాములా ఏదో కనబడింది. అతను హడలిపోయాడు.

'బాబోయ్' అని అరిచి బయటకు వచ్చాడు. అతని తలలో ఎన్నో ఆలోచనలు పరుగెత్తాయి. తన భార్య పుట్టలో పాలు వేసుకొని దయ లేదనే కారణంచేత యే నాగేంద్రుడో కోపగించి అక్కడికి వచ్చాడా? అనుకున్నాడు.

ఆశ్లేష అటువైపు వచ్చి "ఇంకా దీపం ముట్టించలేదేం?" అంది. తనకి జరిగిన అనుభవాన్ని భార్యకి చెప్పలేక "చీకట్లో ఏమీ కనబడటంలేదు; పక్కవాళ్ళ దీపమడుగు'' అన్నాడు.

ఇది మరీ బాగుంది; నే నెల్లా తాకను దీపాన్ని ? అంది ఆశ్లేష.

అతనే గత్యంతరం లేక, వెళ్ళి దీపం తెచ్చాడు లోపల భయపడుతున్నా గుండె ధైర్యం తెచ్చుకొని, లోపలకు అడుగు బెట్టాడు.

తీరా లైటూ కళ్ళూ పెద్దవి చేసుకుని చూసే టప్పటికి గోడమీద పాము ఆకారంతో బొమ్మ వేసుకుని, తనభార్య పూజచేసుకున్న ఆనమాలు కనపడింది.

అతని భయం నవ్వుగా మారిపోయింది. కడుపుబ్బేలా నవ్వుతూ బయటికొచ్చేడు.

ఆశ్లేష అర్థంకాక తెల్లబోయి చూడసాగింది: ఏమండీ; ఏమిటదీ? అంటూ.

ఆఁ, నువ్వు వట్టి చాదస్తపు బార్యవు లెద్దూ, అన్నాడు, బలవంతంగా నవ్వాపు చేసుకుంటో.

———